సాక్షి
వరంగల్

శుక్రవారం | 18 | జూలై | 2025



డిసెంబర్ నాటికి పనులు పూర్తి

కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఎస్‌సీఆర్ జీఎం తెలిపారు. - 8లో▸



పెరిగిన విద్యుత్ వినియోగం

వర్షాభావ పరిస్థితులు, ఎండ తీవ్రత, సాగు పనులు ముమ్మరం కావడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

భాస్కర్‌రావుకు బెస్ట్ టీచర్ అవార్డు



రామన్నపేట: నగరానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు భాస్కర్‌రావు నేషనల్ సుశ్రుత అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన శల్యకాన్–25 జాతీయ సమావేశంలో కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ చేతుల మీదుగా బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. 35 ఏళ్ల వైద్యవృత్తిలో కొనసాగుతూ.. 15 వేలకు పైగా.. అర్షమొలలు, ఫిష్టులా చికిత్సలు చేశారు. ఓవైపు వైద్యవృత్తిని కొనసాగిస్తూనే మరోవైపు సెమినార్లలో పాల్గొనడం, పరిశోధనా పత్రాలు సమర్పించారు. వివిధ దేశాల్లో 30కిపైగా అంతర్జాతీయ పరిశోధనా పత్రాలు సమర్పించిన ఘనత ఆయనది. ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ ఆయుష్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఆయుర్వేద్విద్యా పీటీ గురువుగా పనిచేస్తున్నారు. భాస్కర్‌రావుకు అవార్డు రావడంపై స్నేహితులు, కుటుంబసభ్యులు, తోటి వైద్యులు అభినందనలు తెలిపారు.

గుర్తింపులేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దు

విద్యారణ్యపురి: అనుమతి, గుర్తింపులేని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దని డీఈఓ మామిడాల జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే ముందు ఈ విద్యాసంవత్సరానికి అనుమతి ఉందా లేదా అనేది తెలుసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను మధ్యలోనే మూసివేసే పరిస్థితులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఆగస్టు 31 వరకు మాత్రమే పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు అవకాశం ఉందన్నారు. ఆయా విద్యార్థులకు పెన్ (పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్) కేటాయిస్తారని తెలిపారు. ఈ నంబర్ ద్వారా విద్యార్థి ఏ తరగతి చదువుతున్నాడు, ఏ పాఠశాలలో చదువుతున్నాడు, ఏ పాఠశాలకు మారాడు అనే వివరాలను యూడైస్ పోర్టల్‌లో ట్రాక్ చేస్తారని తెలిపారు. అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తే విద్యార్థికి పెన్ కేటాయించరని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేటప్పుడు కచ్చితంగా గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలని డీఈఓ కోరారు.

మెడికల్ షాపులో చోరీ

నర్సంపేట రూరల్: మెడికల్ షాపులో చోరీ జరిగిందని ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో నిమ్స్ మెడికల్ షాపును చిట్టి గురు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 11.30 గంటలకు షాపు బంద్ చేసుకుని ఇంటికి వెళ్లాడు. ఉదయం షాపు తీసేందుకు రాగా షట్టర్‌కు వేసిన తాళాలు పగులగొట్టి కనిపించాయి. అనుమానంతో షాపు తీసి చూడగా గల్లా పెట్టెలో ఉన్న రూ.35 వేల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు షాపును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగంలో ఉచిత శిక్షణ కం ఎంప్లాయ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టి.రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నెలరోజులపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైనులు, పార్సీ, బౌద్ధులు) మైనారిటీ అభ్యర్థులు సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు హనుమకొండ సుబేదారి షరీఫన్ మజీద్ దగ్గరలోని అపోలో ఫార్మసీ పక్కన రెండో అంతస్తులో ఉన్న మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయం, 040–23236112 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్



కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సబ్ రిజిస్ట్రార్లు రామనరసింహారావు, ఆనంద్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

మూణ్నాళ్లకే మూతబడి..!

- ఈఏడాది ప్రారంభమైన 6 జీరో స్కూళ్లలో మూడు మూసివేత
- ఉపాధ్యాయుల చొరవ, పరిసరాల శుభ్రత లేకపోవడమే కారణం

సాక్షి, వరంగల్: బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు చేరిన 6 జీరో ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. పట్టుమని 10 రోజులు కాకముందే వీటిలో మూడు పాఠశాలలు మళ్లీ మూతబడడం ఆందోళన కలిగిస్తోంది. సర్కారు స్కూళ్లకు పంపండి.. చదువుతోపాటు పౌష్టికాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు, కంప్యూటర్ క్లాస్‌లు ఉన్నాయంటూ ఉపాధ్యాయులు వందలాది మంది విద్యార్థులను చేర్పించారు. ఉపాధ్యాయుల్లో కొందరు ఆ సంఖ్యను కొనసాగించడంలో విఫలమవడంతో తిరిగి ప్రారంభమైన జీరో స్కూల్స్ మూతబడ్డాయి. అమ్మమ్మ ఇంటి వద్దకు వచ్చి ఈ బడుల్లో చేరిన వారు తిరిగి వెళ్లిపోగా.. ఉపాధ్యాయులు సమయానికి రాక ఇంకొందరు విద్యార్థులు,పాఠశాలల పరిసరాలు అంతా చెట్లమయంగా ఉండడం, అపరిశుభ్ర వాతావరణం, పాములు, విషపురుగుల వంటి బెడద ఉందని మరికొందరు ఈ జీరో స్కూల్స్‌కు దూరం కావడం ఆందోళన కలిగిస్తోంది. కారణాలు ఏమైనా విద్యార్థులకు ప్రభుత్వ బడి చదువులపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోకపోవడం వల్లనే ఇలా జరిగిందని విద్యాశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అమ్మమ్మ ఇంటి నుంచి వెళ్లడంతో..

విద్యార్థులు లేకపోవడంతో నల్లబెల్లి మండలం కొండాయిల్‌పల్లి ప్రాథమిక పాఠశాలను 2024లో మూసివేశారు. ఈ ఏడాది బడిబాటలో భాగంగా అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్న ఇద్దరు చిన్నారులు పాఠశాలలో చేరారు. జూలై తొలివారం వరకు హాజరైన ఆ విద్యార్థులు తర్వాత వారి నానమ్మ ఇంటి వద్దకు వెళ్లారు. ఇలా విద్యార్థులు బడికి గైర్హాజరవడంతో ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటున్నారు.



విద్యార్థులు లేని నల్లబెల్లి మండలంలోని కొండాయిల్‌పల్లి ప్రాథమిక పాఠశాల

పాము కాటు భయంతో దూరంగా..

బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు నచ్చజెప్పడంతో నలుగురు విద్యార్థులు చేరడంతో పర్వతగిరి మండలం భట్టుతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభమైంది. గతంలో ఈ బడిలోనే ఓ విద్యార్థి పాముకాటుకు గురై మృత్యువాత పడ్డాడు. ఇప్పటికీ ఈ పాఠశాల పరిసరాలు శుభ్రంగా లేకపోవడం వల్ల అడ్మిషన్లు తీసుకున్న నలుగురు విద్యార్థులు కాస్త మళ్లీ వెనుకంజ వేయడంతో ఈ బడి మూతబడినట్లయ్యింది. ఆ విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్తున్నారు.

ఒక్కొక్కరు చేజారడంతో..

సంగెం మండలంలోని ముమ్మిడివరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక 2018లో మూతబడింది. అయితే ఈ ఏడాది బడిబాటలో భాగంగా 10 మంది విద్యార్థులు చేరడంతో పునఃప్రారంభమైంది. రోజులు గడుస్తున్నా కొద్దీ ఒక్కొక్కరు పాఠశాలకు రాకపోవడంతో ఇప్పుడు ఆ సంఖ్య మళ్లీ జీరోకు చేరింది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కుమారస్వామిని తిరిగి డిప్యుటేషన్‌పై మొండ్రాయిలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించారు.

చొరవ చూపిస్తేనే ముందుకెళ్లేది..

- నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారు హేమ్లా తండా ప్రాథమిక పాఠశాల 2022లో విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. అక్కడి ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలలకు పంపించారు. ఈ ఏడాది బడిబాటలో భాగంగా ఈ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు చేరడంతో ఉపాధ్యాయురాలు విజయరాణి పాఠాలు బోధిస్తున్నారు.
- విద్యార్థులు లేకపోవడంతో నర్సంపేట మండలంలోని రాజపేట గ్రామశివారు చింతగడ్డ తండా ప్రాథమిక పాఠశాల 2022లో మూతబడింది. ఈ ఏడాది బడిబాటలో భాగంగా ఒకటో తరగతిలో ముగ్గురు, రెండో తరగతిలో నలుగురు విద్యార్థులు చేరారు. ఈ ఏడుగురు విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు గోవర్ధన్ పాఠాలు చెబుతున్నారు.
- నల్లబెల్లి మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేకపోవడంతో 2022లో మూతబడింది. ఈ ఏడాది బడిబాటలో భాగంగా ఉపాధ్యాయుల చొరవతో 10 మంది విద్యార్థులు చేరడంతో తిరిగి ప్రారంభమైంది. ఈ మూడు పాఠశాల్లో ఉపాధ్యాయులు రెగ్యులర్ వచ్చి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తేనే ఇవి కొనసాగుతాయి. లేదంటే ఇప్పటికే రీ ఓపెన్ అయి రోజుల వ్యవధిలోనే మూతబడిన పాఠశాలలుగా మారే ప్రమాదముంది.

రైతు సేవలో టీజీ ఎన్పీడీసీఎల్

పొలంబాటతో సమస్యల పరిష్కారం

- యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీసుల మంజూరు
- రైతులకు తెలుగులో ఎస్టిమేట్ ప్రతులు

హన్మకొండ: రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కృషి చేస్తోంది. పొలంబాట ద్వారా నేరుగా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తోంది. విద్యుత్ ప్రమాదాలు, భద్రతపై విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ సర్వీసులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 2023 జూలై 15 నుంచి 2024 జూలై 14 వరకు 1,261 సర్వీస్‌లు, 2024 జూలై 15 నుంచి 2025 జూలై 15 వరకు 1,302 వ్యవసాయ సర్వీస్‌లు మంజూరు చేశారు. వరంగల్ జిల్లాలో 2023 జూలై 15 నుంచి 2024 జూలై 14 వరకు 7,571 సర్వీస్‌లు, 2024 జూలై 15 నుంచి 2025 జూలై 15 వరకు 824 వ్యవసాయ సర్వీస్‌లు మంజూరు చేశారు. పొలం బాట ద్వారా హనుమకొండ జిల్లాలో ఇప్పటివరకు 1,216 లూజ్ లైన్లు, 476 వంగిన స్తంభాలు,3,609 మధ్య స్తంభాలు ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 1,141లూజ్‌లైన్లు,445 వంగిన స్తంభాలు, 2,965 మధ్య స్తంభాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్ల ఏర్పాటుతో ప్రయోజనం ఉంటుందని అవగాహన కల్పిస్తున్నారు.

డిపార్ట్‌మెంట్ వాహనాల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు..

రైతులకు వ్యవసాయ సర్వీస్ మంజూరుకు చెందిన ఎస్టిమేట్ కాపీలు తెలుగులో అందిస్తున్నారు. రైతుల ఫోన్ నంబర్‌కు వచ్చే ఎస్ఎంఎస్ లింకు క్లిక్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చు. తద్వారా రైతులకు అందించే మెటీరియల్ జాబితాపై వారికి పూర్తి స్పష్టత వస్తుంది. ఎస్ఎంఎస్‌లు కూడా తెలుగులోనే పంపుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డిపార్ట్‌మెంట్ వాహనాల్లోనే తరలించాలని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుకు ఎస్పీఎం హెడ్‌లు ఏర్పాటు చేశారు. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వేగంగా జరిగి వెంటనే బిగించే ఆస్కారం ఉంటుంది. వ్యవసాయ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా పిడుగుల నిరోధకాలు అమర్చుతున్నారు. వేసవి కార్యాచరణలో భాగంగా అధిక భారం ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గించేందుకు హనుమకొండ జిల్లాలో అదనంగా 181 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా 145 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. వరంగల్ జిల్లాలో అదనంగా 214 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, 213 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు.

త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు..



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్వరితగతిన వేరే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్నాం పట్టణాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో మార్చుతున్నాం. రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్య ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1912కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన సేవలు అందిస్తున్నాం.

\- కె.గౌతంరెడ్డి, వరంగల్ ఎస్ఈ

మహిళల భద్రత కోసమే షీటీంలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

నర్సంపేట: మహిళలు, విద్యార్థినులకు భద్రతపై భరోసా కల్పించేందుకే నర్సంపేటలో షీటీం ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు పోలీస్ సిబ్బంది నివాస ప్రాంగణంలో షీ టీం కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నర్సంపేట షీటీం తొలి ఎస్సై స్వాతికి పోలీస్ కమిషనర్ మొక్క అందజేసి అభినందించారు. నర్సంపేటలోని షీ టీం విభాగం నిర్వర్తించాల్సిన విధుల గురించి షీ టీం ఏసీపీ సదయ్య పోలీస్ కమిషనర్‌కు వివరించారు. విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించాలని సీపీ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం మూడు షీ టీంలు పనిచేస్తున్నాయని, ఎవరైనా ఆకతాయిలు మహిళలను వేధించినా, లైంగిక వేధింపులకు గురిచేసినా తక్షణమే నర్సంపేట షీ టీం విభాగం ఫోన్‌నంబర్ 8712552326కు సమాచారం అందించాలన్నారు. రానున్న రోజుల్లో జనగామ జిల్లా కేంద్రంలోను షీ టీం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీలు రవీందర్‌రెడ్డి, సదయ్య, వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీం ఇన్‌స్పెక్టర్ సుజాత, నర్సంపేట ఇన్‌స్పెక్టర్ రఘు, దుగ్గొండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయిరమణ తదితరులు పాల్గొన్నారు.



షీటీం ఎస్సై స్వాతికి మొక్క అందజేసి అభినందిస్తున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

పోలీస్‌స్టేషన్లను సందర్శించిన సీపీ..

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ గురువారం నర్సంపేట డివిజన్ పరిధిలోని నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం పోలీస్‌స్టేషన్లతోపాటు నర్సంపేట ఏసీపీ, దుగ్గొండి సర్కిల్ పోలీస్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని, రాత్రి సమయాల్లో గస్తీ పెంచాలని సిబ్బందికి సూచించారు.

14.06 టీఎంసీలు.. 6.46 లక్షల ఎకరాలు

వానాకాలం సాగుపై నీటిపారుదల శాఖ ప్రణాళిక ఇది

- 'స్కివం' కమిటీ సమావేశంలో యాక్షన్ ప్లాన్ ఖరారు
- వరంగల్, ములుగు సీఈల ప్రతిపాదనలకు ఆమోదం
- ప్రస్తుత నీటి లభ్యతను బట్టి నిర్ణయం.. వరదలొచ్చే వరకు ఆన్ అండ్ ఆఫ్..
- 15 రోజులకోసారి వారబందీ పద్ధతిన విడుదల

సాక్షిప్రతినిధి, వరంగల్: నీటిపారుదల శాఖ వరంగల్, ములుగు సర్కిళ్ల పరిధిలో వానాకాలం సాగు నీటి విడుదల యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేసింది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, వర్షం, వరదలను అంచనా వేసి ఉమ్మడి వరంగల్‌లో ఖరీఫ్ పంటలకు నీరిందించే విధంగా ప్రణాళికను ప్రకటించింది. 2,52,623 ఎకరాల తరి, 3,94,041 ఎకరాల ఆరుతడి కలిపి మొత్తం 6,46,664 ఎకరాలకు 14.06 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయనున్నట్లు యాక్షన్ ప్లాన్‌లో పేర్కొంది. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏడబ్ల్యూ (స్కివం) సమావేశం అనంతరం సాగునీటి వివరాలను ప్రకటించారు.

నీటి విడుదల తేదీ త్వరలో ప్రకటన..



ఉమ్మడి వరంగల్‌లో వాస్తవంగా ఎస్సారెస్పీ, దేవాదుల, సరస్సులు, చిన్ననీటి వనరుల ద్వారా స్థిరీకరించిన ఆయకట్టు 9,43,530 ఎకరాలు కాగా.. ప్రస్తుత పరిస్థితులు, నీటిలభ్యతను బట్టి 6,46,664 ఎకరాలకు ఆన్ అండ్ ఆఫ్ (వారబందీ) పద్ధతిన సరఫరా చేయనున్నారు. 15 రోజులు విడుదల చేసి 15 రోజులు ఆఫ్ చేసే పద్ధతిలో ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం ఇరిగేషన్ వరంగల్ సర్కిల్ పరిధిలో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు అన్ని నింపి 2,03,641 ఎకరాలకు 11.48 టీఎంసీలు సరఫరా చేయనున్నారు. సరిపడా వరదలు వచ్చిన తర్వాత సమీక్షించి ఎల్ఎండీ దిగువన కాకతీయ కాల్వ, ఎస్సారెస్పీ–2 కాల్వల ద్వారా మరో 2,91,936 ఎకరాలకు నీటి సరఫరా చేస్తారు. ములుగు సర్కిల్ పరిధిలో 10.05 టీఎంసీలకు 2.419 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఎల్ఎండీ, దేవాదుల, రామప్ప, లక్నవరం, మల్లూరు వాగు, పాలెం వాగుల ద్వారా 34,618 ఎకరాల తరి, 1,16,469 ఎకరాల ఆరుతడి కలిపి 1,52,087 ఎకరాలకు సుమారు 2.58 టీఎంసీల నీటిని సరఫరా చేయాలని అధికారులను 'స్కివం' కమిటీ ఆదేశించింది. ఈ మేరకు 15 రోజులకోసారి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన వానాకాలం పంటలకు నీరందించేందుకు ప్రణాళిక సిద్ధం కాగా.. నీటిని విడుదల చేసే తేదీలను త్వరలోనే అధికారులు ప్రకటించనున్నారు.

చీఫ్ ఇంజనీర్ల ప్రతిపాదనలు.. 'స్కివం' కమిటీ సూచనలు..

ములుగు సర్కిల్ పరిధిలోని 1,03,883 ఎకరాల ఆయకట్టుకు అధికారులు 93,750 ఎకరాలు ప్రకటించగా.. వరద ఇన్‌ఫ్లోను బట్టి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. దేవాదుల ద్వారా 4,170 ఎకరాలకు 3,570 ఎకరాలకు 0.35 టీఎంసీలు, పాకాల కింద 23,193 ఎకరాలకు 1.43 టీఎంసీలు, రామప్ప ద్వారా 6,780కు 0.80 టీఎంసీల నీటిని ప్రతిపాదించారు. లక్నవరం, మల్లూరు వాగు, పాలెం వాగు ద్వారా 23,794 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించగా.. ఎస్సారెస్పీలో నీటి కొరత కారణంగా ఎల్ఎండీ, ఎస్సారెస్పీ కింద ప్రతిపాదించిన ఈ ఆయకట్టు, ఎస్సారెస్పీ స్టేజ్–2కు తగినంత ఇన్‌ఫ్లో వచ్చిన తర్వాత సమీక్షించనున్నట్లు 'స్కివం' సూచించింది. గోదావరి నదిలో తగినంత నీరు అందుబాటులో ఉన్నందున దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని అన్ని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నింపాలని కూడా కమిటీ ఆదేశించింది. ఇంకా రామప్ప సరస్సు నుంచి పాకాల సరస్సుకు పంపింగ్ అందుబాటులో ఉన్నందున ఈ ప్రాజెక్టుల కోసం ములుగులోని సీఈలు ప్రతిపాదించిన కార్యాచరణను కమిటీ అంగీకరించి అమలు చేయాలని సిఫార్సు చేసింది.

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీయులు

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని విదేశీయులు గురువారం సందర్శించారు. బాలవికాస పీపుల్స్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కింద సీడీఎస్‌డీ కోర్సులో ఈ నెల 14 నుంచి 24 వరకు శిక్షణ పొందుతున్న విదేశీయులు క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. ఇటలీ, నేపాల్, శ్రీలంక, భారతదేశంలోని జమ్మూకశ్మీర్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 10 మంది పర్యటించారు. గ్రామంలో బీసీ హాస్టల్, పీహెచ్‌సీని ఏర్పాటు చేసుకునే దిశగా ముందుకు సాగుతామని వారికి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి తెలిపారు. అలాగే, వితంతువుల జీవన విధానం, గ్రామ అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం తదితర విషయాలను వివరించారు. బాలవికాస ప్రోగ్రాం డైరెక్టర్ సునీతారెడ్డి, సీనియర్ అసోసియేట్ కె.రమ, పంచాయతీ కార్యదర్శి కె.రమ్యకుమారి, పీఆర్‌ఏ ఎన్. శేఖర్, గ్రామ పెద్దలు కూసం లింగయ్య, రమేశ్ పాల్గొన్నారు.



గంగదేవిపల్లిని సందర్శించిన పలు దేశాల ప్రతినిధులతో గ్రామస్తులు

డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు

హసన్‌పర్తి: ఆర్టీసీ, ప్రైవేట్, స్కూల్‌బస్సుల డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. గురువారం ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని ఫాతిమా సెంటర్ వద్ద డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ముందస్తు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించినట్లు ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- రూ.19,800 నగదు స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి: స్నేహితుడితో కలిసి దొంగతనానికి పాల్పడ్డాడు ఓ ఎలక్ట్రీషియన్. నిందితులను నల్లబెల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.19,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై గోవర్ధన్ వివరాలు వెల్లడించారు. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బొడిగె ప్రశాంత్ (బక్కులు) ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. నల్లబెల్లి తిరుమల వైన్‌షాపులో పలుమార్లు విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టాడు. ఈ క్రమంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేయడం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ప్రశాంత్ దొంగతనం చేయాలనే ఆలోచనకు వచ్చాడు. వైన్ షాపులో పనిచేస్తున్న సమయంలో చోరీకి రెక్కీ నిర్వహించాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడు ఎల్లబోయిన సాయికుమార్ (బన్నీ)తో చర్చించాడు. జల్సాలకు అలవాటుపడిన వారు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి వైన్ షాపు వెంటిలేటర్‌ను బొడిగె ప్రశాంత్ పగులగొట్టి లోపలకు చొరబడ్డాడు. క్యాష్ కౌంటర్‌లోని డబ్బులు దొంగిలించగా, కాపలా సాయికుమార్ ఉన్నాడు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిఘా పెట్టారు. గురువారం నల్లబెల్లి క్రాస్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులకు వీరు అనుమానాస్పదంగా కనిపించారు. ఎస్సై తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.19,800 స్వాధీనం చేసున్నామని వెల్లడించారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుళ్లు ప్రభాకర్, సాయిలు, హోంగార్డు రమేశ్ పాల్గొన్నారు.

జిల్లాకు 'కాయకల్ప' అవార్డులు

- 22 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసిన ప్రత్యేక కమిటీ
- వీటిలో 9 పీహెచ్‌సీలు, 3 యూపీహెచ్‌సీలు, 12 ఏఏఎంలు

గీసుకొండ: జిల్లాకు కాయకల్ప అవార్డుల పంట పండింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, జాతీయ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా 2024–2025 సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ అవార్డుకు మెరుగైన వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, కలిగి ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో జిల్లా నుంచి మొత్తం 22 ఆరోగ్య కేంద్రాలు కాయకల్ప అవార్డుకు ఎంపికైనట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు గురువారం తెలిపారు.

ఎంపికైన పీహెచ్‌సీలు..

జిల్లాలో 14 పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిలో గీసుకొండ, పర్వతగిరి, సంగెం, నెక్కొండ, నల్లబెల్లి, మేడపల్లి, కేశవాపూర్, అలంకానిపేట, పైడిపల్లి పీహెచ్‌సీలు కాయకల్ప అవార్డుకు ఎంపికయ్యాయి. ఈ అవార్డు కింద ఎంపికైన 9 పీహెచ్‌సీలకు రూ.6 లక్షల నగదు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు.

యూపీహెచ్‌సీలు..



అవార్డుకు ఎంపికైన గీసుకొండ పీహెచ్‌సీ ఎదుట వైద్యులు, సిబ్బంది

జిల్లాలో ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కీర్తినగర్, దేశాయిపేట, చింతల్ పీహెచ్‌సీలను అవార్డుకు ఎంపిక చేశారు. వీటికి రూ.మూడు లక్షలను ప్రోత్సాహకంగా అందిస్తారు.

12 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (ఏఏఎం)..

జిల్లాలో నర్సంపేటలో మూడు, అశోక్‌నగర్‌లో ఒకటి, తిమ్మంపేట, రెడ్లవాడ, ఇటుకాలపల్లి, ధర్మారం, అమీనాబాద్, కోనాపురం, తూర్పుతండా, గవిచర్లలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఎంపిక చేశారు. వీటికి రూ.2.60 లక్షలను నగదు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు.

కలెక్టర్ అభినందనలు..

జిల్లాలోని 22 ఆరోగ్యకేంద్రాలు జిల్లాస్థాయి కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడంతో కలెక్టర్ సత్యశారద వైద్యాధికారులు, సిబ్బందిని అభినందించినట్లు డీఎంహెచ్ఓ బి.సాంబశివరావు తెలిపారు. ఆరోగ్య జిల్లాగా మార్చడానికి వైద్య, ఆరోగ్య విభాగం మరింత కృషి చేయాలని ఆయన కోరారు.

కాయకల్ప కార్యక్రమం ఇలా..

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో కాయకల్ప కార్యక్రమం ప్రారంభమైంది. ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం, ఇన్‌ఫెక్షన్ సోకకుండా చర్యలు చేపట్టేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం విషయాల్లో ఉన్నత ప్రమాణాలను పాటించే వారికి స్వచ్ఛ భారత్ అభియాన్–2015లో భాగంగా కాయకల్ప అవార్డులు ఇస్తున్నారు. ఏదైనా ఆరోగ్య కేంద్రం పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాల నాణ్యతను పెంపొందించే విషయంలో 70 శాతం స్కోర్ చేస్తే అవార్డుకు ఎంపిక చేస్తున్నారు. అవార్డు ఎంపిక కోసం ప్రతీ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటైన కమిటీ పరిశీలించి స్కోర్ ఇస్తుంది.

నేడు ఎన్‌క్లోజర్‌లోకి వైట్ టైగర్

న్యూశాయంపేట : హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జువాలజికల్ పార్కులో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన తెల్లపులి (వైట్ టైగర్)ను శుక్రవారం ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభిస్తారని జూపార్కు అధికారులు తెలిపారు.

ఆస్ట్రిచ్‌ను దత్తత తీసుకున్న 'కుడా' చైర్మన్

జూపార్కులోని జంతువుల దత్తత పథకంలో భాగంగా ఒక ఆస్ట్రిచ్ పక్షిని 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆరు నెలల పాటు దత్తత తీసుకున్నారు. ఈమేరకు గురువారం జూపార్కుకు వెళ్లి ఆస్ట్రిచ్ పక్షి సంరక్షణ, పోషణ కోసం రూ.60 వేల చెక్కును జూపార్క్ రేంజ్ అధికారి మయూరికి అందించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సక్రమంగా బోధించాలి

● కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: విద్యార్థులకు సక్రమంగా బోధించాలని కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం అన్నారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలోని విద్యాకళాశాలలో ప్రిన్సిపాల్ టి.మనోహర్‌తో కలిసి అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో రామచంద్రం మాట్లాడారు. ఈనెల 16న విద్యాకళాశాలలో విద్యార్థులు ఆందోళన చేసి పలు సమస్యలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో చర్చించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ పాఠాలు సరిగా అర్థం కావం లేదని విద్యార్థులు చెబుతున్నారని, అధ్యాపకులు ముందు ప్రిపేర్ అయిన సరిగా బోధించాలని సూచించారు. ఎలాంటి పక్షపాతం లేకుండా జవాబుపత్రాల వాల్యుయేషన్ చేయాలని చెప్పినట్లు సమాచారం. విద్యార్థినుల పట్ల అనుచితంగా మాట్లాడొద్దని ఆదేశించారని తెలిసింది. కాగా, కొందరు విద్యార్థులు క్లాస్‌లకు సరిగా రావడం లేదనే విషయాలను పలువురు అధ్యాపకులు.. రిజిస్ట్రార్ దృష్టి తీసుకెళ్లారు. తాము సరిగానే మూల్యాంకనం చేస్తున్నామని సమాధానం ఇచ్చారని తెలిసింది. అనంతరం విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించాక 75 నుంచి 80 శాతం అటెండెన్స్ ఉండాలని విద్యార్థులకు చెప్పానన్నారు. క్లాస్‌లకు వచ్చే వారికే అటెండెన్స్ వేయిస్తున్నామన్నారు. సరిపడా అటెండెన్స్ లేనిపక్షంలో పరీక్షలకు కూడా అనుమతించబోమని స్పష్టం చేశారని సమాచారం.

పోక్సో కేసులో తండ్రికి రిమాండ్

దేవరుప్పుల : మండలంలోని ఓ గ్రామంలో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిని పోక్సో కేసులో గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల నుంచి కూతురు పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న తండ్రిపై కుటుంబీకుల ఫిర్యాదు చేశారన్నారు. దీంతో పోక్సో కేసు నమోదు చేసి జనగామ కోర్టులో హాజరుపర్చామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రహరీకి అమర్చిన కరెంట్ బైండింగ్ వైర్‌కు తాకి..

● విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రవి మృతదేహం

ములుగు రూరల్: ప్రహరీకి అమర్చిన కరెంట్ బైండింగ్ వైర్‌కు తాకి ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం ఇంచర్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల రవి(45) తాపీ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం జంగాలపల్లి క్రాస్ వద్ద బుర్ర సమ్మయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనికి వెళ్లాడు. సమ్మయ్య ఇంటి పక్కన ఉన్న గౌస్‌పాషా అనే వ్యక్తి కోతల బెడద కారణంగా ప్రహరీకి బైడింగ్ వైరు అమర్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. రవి ఉదయం సమ్మయ్య ఇంటికి పనికి వచ్చి ఏమరపాటున ప్రహరీకి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎండీ గౌస్, అతడి భార్య నస్రీన్, బుర్ర సమ్మయ్య, అతడి భార్య వనమాల, కొడుకులు నరేశ్, సురేశ్, రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లు, ప్రహరీలకు ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ అమర్చి అమాయకుల మృతికి కారణం కావొద్దన్నారు. ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ అమర్చిన వారిని, అది తెలిసి సమాచారం ఇవ్వని వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

● టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఈనెల 16వ తేదీ వరకు 1059.994 మిలియన్ యూనిట్లు
● గతేడాది ఇదే సమయానికి 953.069 మిలియన్ యూనిట్లు..
● ఎండల తీవ్రత, వర్షాభావ పరిస్థితుల ప్రభావమే కారణం

హన్మకొండ: వర్షాభావ పరిస్థితులు, ఎండ తీవ్రత, సాగు పనులు ముమ్మరం కావడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వేసవికి దీటుగా వినియోగదారులు విద్యుత్‌ను వాడుతున్నారు. ఫలితంగా వర్షాకాలంలో మునుపెన్నడూ లేని విధంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. మే మాసంలో మురిపించిన వర్షాలు.. వానాకాలం సీజన్ మొదలు కాగానే ముఖం చాటేశాయి. దీంతో వాతావరణ పరిస్థితులు వేసవిని తలపిస్తున్నాయి. ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. మరో వైపు వర్షాలు కురవకపోడంతో మెట్ట పంటలు వేసి.. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న రైతులు ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు తడులు పెడుతున్నారు. దీనికి తోడు రైతులు నాటు వేసేందుకు పొలాన్ని దున్నుతున్నారు. ఫలితంగా భూగర్భ జలాలు తోడేందుకు మోటార్లు వాడుతుండడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. మొత్తంగా వేసవికి మించిన విద్యుత్ వినియోగం పెరుగుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 16వ తేదీ వరకు 1059. 994 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగించారు. గతేడాది ఇదే సమయానికి 953.069 మిలియన్ యూనిట్లు వాడారు. గతేడాదితో పోలిస్తే 106.925 మిలియన్ యూనిట్లు అదనంగా వినియోగించారు.



వర్షాభావ పరిస్థితులతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 22.060 మిలియన్ యూనిట్లు అధికంగా వినియోగించారు. జగిత్యాల సర్కిల్‌లో గతేడాది కంటే ప్రస్తుతం 12.777 మిలియన్ యూనిట్లు, ఖమ్మంలో గతేడాదికంటే ప్రస్తుతం 18.393 మిలియన్ యూనిట్లు, హనుమకొండ సర్కిల్‌లో గతేడాదితో పోలిస్తే 15.460 మిలియన్ యూనిట్లు అధికంగా, మంచిర్యాల సర్కిల్‌లో గతేడాదితో పోలిస్తే 8.053 మిలియన్ యూనిట్లు అధికంగా వినియోగించారు. కాగా, ఆదిలాబాద్, నిర్మల్‌లో గతేడాది కంటే తక్కువ వినియోగించారు. కామారెడ్డి సర్కిల్‌లో గతేడాదితో పోలిస్తే 1.926 మిలియన్ యూనిట్లు తక్కువ, నిర్మల్‌లో 1.148 మిలియన్ యూనిట్లు తక్కువ వినియోగించారు. ఇదిలా ఉండగా జూలై మాసంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 2న అతి తక్కువ 48,571 మిలియన్ యూనిట్లు వినియోగించగా ఈ నెల 16న అత్యధికంగా 85.294 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు. జూన్ 30, జూలై 1, 2 తేదీల్లో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఈ నెల 2న అతి తక్కువ వినియోగం జరిగింది. గతేడాది జూలై 2న 55.352 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగించగా ఈ నెల 2న 48.571 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగించారు. ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఈ నెల 16 వరకు అత్యధికంగా 85.294 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగించారు. గతేడాది ఈ తేదీన 58.616 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగమైంది. 26.678 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది.

జూలై 1 నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగం వివరాలు (మిలియన్ యూనిట్లలో)

జిల్లా	2025	2024	తేడా (అదనపు వినియోగం)
హనుమకొండ	71.600	56.140	15.400
వరంగల్	47.059	42.100	4.959
జనగామ	66.910	59.400	7.510
మహబూబాబాద్	40.280	36.050	4.230
జే.ఎస్.భూపాలపల్లి	59.450	37.390	22.060

వేగంగా విద్యుత్ సమస్యల పరిష్కారం

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
● దేవన్నపేట సబ్ స్టేషన్ తనిఖీ



దేవన్నపేట సబ్‌స్టేషన్‌లో అధికారులకు సూచనలిస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ/హసన్‌పర్తి: నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని వేగంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి 'రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం'ను ప్రవేశపెట్టినట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ నగర శివారులోని దేవన్నపేట 33/11 కేవీ సబ్ స్టేషన్ తనిఖీ చేశారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. ఎదురవుతున్న సమస్యలు, పరిష్కరిస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం ఎంతో దోహద పడుతుందన్నారు. రియల్ టైంలో విద్యుత్ అంతరాయ సమాచారాన్ని ఫీల్డ్ సిబ్బందికి తెలిపి అతి తక్కువ సమయంలో కరెంట్ సరఫరాను పునరుద్ధరించొచ్చన్నారు. విద్యుత్ వినియోగం, ఓల్టేజీ లెవెల్స్, తదితర వివరాలు రియల్ టైంలో సేకరిస్తారన్నారు. అనంతరం మడికొండ సెక్షన్‌లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ తిరుమల్ రావు, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, ఐటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఎమ్మార్టీ డీఈ దర్శన్ కుమార్, కె.అనిల్ కుమార్, ఏడీఈ పి.అశోక్, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి



నాగరాజు(ఫైల్)

మల్హర్: పిడుగుపాటుతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లారం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన కల్వల నాగరాజు (20) తమ వ్యవసాయ మోటారు మల్లారం మానేరు వాగులో మునిగిపోతుండడంతో తీసేందుకు గురువారం సాయంత్రం తండ్రితో కలిసి వెళ్లాడు. వాగులోనుంచి మోటారును బయటకు తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు.

నీళ్లు మింగుతున్నారు..!

అన్‌యూజ్డ్ పోస్టుల కన్వర్షన్‌లో వసూళ్ల పర్వం
● 'సాక్షి' కథనం 'పంచుకున్నదెవరు' తో విద్యుత్ ఉద్యోగుల్లో కలకలం
● ఇంటెలిజెన్స్‌తోపాటు సంస్థ విజిలెన్స్ విభాగం విచారణ



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో అన్‌యూజ్డ్ పోస్టులను వినియోగంలోకి తీసుకురావడంలో ఖర్చుల పేరుతో జరిగిన వసూళ్లపై 'సాక్షి'లో ఈ నెల 16న ప్రచురితమైన 'పంచుకున్నదెవరు' కథనానికి కొందరు నీళ్లమింగుతున్నారు. వసూళ్లు, పంపకాలతో సంబంధమున్నట్లు అనుమానిస్తున్న వారు.. తమ అనుచరుల ద్వారా 'సాక్షి' కథనం తర్వాత ఏమి జరుగుతుందని ఆరా తీస్తున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏళ్లుగా వృథాగా ఉన్న 216 అన్‌యూజ్డ్ పోస్టులు, ఖాళీగా ఉంటున్న 216 అన్‌యూజ్డ్‌పోస్టులను వినియోగంలోకి తీసుకొస్తూ వివిధ కేటగిరీల్లో 339 నూతన పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. అన్‌యూజ్డ్ పోస్టులను వినియోగంలోకి తీసుకురావడానికి నూతన పోస్టులు మంజూరుకు ఖర్చులవుతాయని చెప్పి ఓ ప్రధాన ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకుడు వసూళ్లు చేసినట్లు విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ఇంజనీర్స్ అసోసియేషన్లతో పాటు, ఇతర ఉద్యోగ అసోసియేషన్లు కూడా ఖర్చుల కోసం తమ సభ్యుల నుంచి వసూలు చేసి ఆ ఇంజనీర్ అసోసియేషన్ నాయకుడికి ముట్టచెప్పినట్లు సమాచారం. ఇందులో కొందరు నేరుగా ఓ బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు ఇతర మార్గాల్లో ముట్టజెప్పినట్లు తెలిసింది. అయితే కొత్త పోస్టుల మంజూరులో ఎలాంటి డబ్బులు ఖర్చు కాలేదని స్పష్టమవడంతో వసూళ్లు చేసిన సొమ్ము ఎవరెవరి చేతుల్లోకి మారిందనే అంశం కలకలం రేపుతోంది. 'సాక్షి' ప్రచురితమైన కథనంతో ఈ డబ్బుల లావాదేవీలతో సంబంధమున్న వారు తమ ప్రమేయం, తమ పేర్లు ఎక్కడ బయటపడుతాయోనని ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. దీంతో డబ్బులు చేతులు మారినట్లు వారు పరోక్షంగానే బయటపడుతున్నారు. తన లాభం కోసం ఇతరుల ప్రయోజనాలను అడ్డుకోవడంతో పాటు, ఎలాగైనా ఆశించింది దక్కించుకోవడానికి ఆ నాయకుడు ఏదైనా చేస్తాడని విద్యుత్ ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. తనకు పదోన్నతి రావడానికి మూడేళ్లగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాగా, వసూళ్ల పర్వంపై ఇంటెలిజెన్స్‌తో పాటు టీజీ ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. ఎవరు వసూలు చేశారు...? ఎంత మొత్తంలో చేశారు...? ఎవరెవరు పంచుకున్నారు...? ఎవరికి ముట్టజెప్పారు...? వంటి అంశాలపై ఇంటెలిజెన్స్, ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు.

డిసెంబర్ నాటికి యూనిట్ పనులు పూర్తి

● 2026 మార్చిలో అధికారికంగా ప్రారంభం
● రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ
● కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పరిశీలన





రైల్వే మాన్యుఫాక్చరింగ్ లేవుట్‌ను జీఎం శ్రీవాస్తవకు వివరిస్తున్న రైల్వే పీసీఎంఈ మధుసూదన్‌రావు , జనగామ: సుందరీకరణ పనుల వివరాలు తెలుసుకుంటున్న జీఎం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి 2026 మార్చి నాటికి అధికారింగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. కాజీపేట మండలం అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (కోచ్‌ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్, వ్యాగన్ రిపేర్ షెడ్ మల్టీపుల్ ప్రాజెక్ట్)ను గురువారం రైల్వే జీఎం సందర్శించి ప్రాజెక్ట్ లేఅవుట్ పరిశీలించగా పనుల పురోగతి సమగ్ర నివేదికను అధికారులు వివరించారు. కాన్ఫరెన్స్ హాల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో యూనిట్ నిర్మాణానికి సంబంధించిన అప్ డేట్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కలియ తిరిగి వివిధ డిపార్ట్‌మెంట్ వివరాలను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ విలేకరులతో మాట్లాడుతూ షెడ్ అంతర్గత నిర్మాణ పనులు జరుగుతున్నాయని, నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. భద్రతా అంశాలను పరిశీలించి మార్గదర్శకాలు, విధానాలు పాటించేలా అధికారులు నిర్ధారించుకోవాలన్నారు. అంతకు ముందు ప్రత్యేక రైలులో జీఎం సికింద్రాబాద్ నుంచి కాజీపేట వరకు రియర్ విండో తనిఖీలో ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా అంశాలను పరిశీలించారు. రైల్వే యూనిట్‌ను తనిఖీ చేసి తిరుగు ప్రయాణంలో కాజీపేట రైల్వే అమృత్ భారత్ పనులు, రైల్వే లాబీ, ఆర్ఆర్ఐ రిలేను, కాకతీయ రన్నింగ్ రూంను తనిఖీ చేసి సిబ్బంది సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. జీఎం పర్యటన కార్యక్రమంలో సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం భర్తేష్‌కుమార్ జైన్, రైల్వే పీసీఎంఈ సి.మధుసూదన్‌రావు, రైల్వే సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ రామారావు, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఆర్‌వీఎన్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలి..

జనగామ: రైల్వేస్టేషన్ సుందరీకరణ పనుల్లో మరింత వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ ఆదేశించారు. గురువారం సికింద్రాబాద్ నుంచి కాజీపేట వెళ్తూ మార్గమధ్యలో జనగామ రైల్వేస్టేషన్‌లో ఆగారు. స్టేషన్ సేవలు, సుందరీకరణ పనులు, ప్రయాణికుల సౌకర్యాలు తదితర వాటిని పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం ఉండకుండా చూడాలన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫ్లాట్‌ఫాంపై షెడ్ల నిర్మాణం, ప్రయాణికులు వేచి ఉండే ఏసీ, జనరల్ గదులు, ముఖ ద్వారం పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

జాన్‌పాక వద్ద ఆర్‌ఓబీ నిర్మించండి



రైల్వే జీఎంకు ఆర్వోబీ మ్యాప్‌ను వివరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, చిత్రంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇనుగాల వెంకట్రాంరెడ్డి



రైల్వే జీఎంకు వినతిపత్రం ఇస్తున్న భూనిర్వాసితులు

కాజీపేట రూరల్/న్యూశాయంపేట : జాన్‌పాక వద్ద ఐఆర్ఆర్ ఏర్పాటు చేస్తున్నందున ఆర్‌యూబీకి బదులు ఆర్‌ఓబీ నిర్మించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద.. గురువారం కాజీపేట మండలం అయోధ్యపురంలోని రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పరిశీలనకు వచ్చిన రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ కలిసి కోరారు. జాన్‌పాక ఎల్‌సీ 63ఏను మూసివేస్తూ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులు నిర్ణయించిన నేపథ్యంలో దాని పక్కనుంచి కుడా ఆధ్వర్యంలో ఇన్నర్‌రింగ్‌రోడ్ నిర్మాణం జరుగుతున్నందున రైల్వే ఓవర్‌బ్రిడ్జి పరిశీలించాలని కలెక్టర్‌తోపాటు కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్,'కుడా'చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి కోరారు. దీనిపై పరిశీలిస్తామని జీఎం హామీ ఇచ్చారు.

కాజీపేట రైల్వే బస్టాండ్ కోసం స్థలం ఇవ్వండి

కాజీపేట రైల్వే బస్టాండ్ కోసం స్థలం ఇవ్వాలని, చిరు వ్యాపారులకు కాంప్లెక్స్ నిర్మించాలని, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు ఉద్యోగవకాశం కల్పించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి..రైల్వే జీఎంకు వినతిపత్రం ఇచ్చారు.

పరిహారం ఇప్పించండి..

రైల్వే యూనిట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రైల్వే జీఎంను అయోధ్యపురం రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ భూనిర్వాసిత రైతులు కలిసి తమకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, రైల్వేనుంచి రావాల్సిన పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. జీఎంను కలిసిన వారిలో ఉల్లెంగుల శ్రీనివాస్, మామిండ్ల మల్లయ్య, మామిండ్ల బిక్షపతి, ఎలసగరం సమ్మయ్య, గడ్డం అనిల్, కాయిత రమ, జేరుపోతుల కుమారస్వామి ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీలో మరో 9మంది అరెస్ట్

● వివరాలు వెల్లడించిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామన్నపేట : నకిలీ సర్టిఫికెట్ల తయారీలో ప్రధాన సూత్రదారుడు అమరేందర్‌ను ఈ నెల 12వ తేదీన అదుపులోకి తీసుకోగా అతడికి సహకరించిన మరో 9 మందిని గురువారం అరెస్ట్ చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. అమరేందర్ హైదరాబాద్, వరంగల్ రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేస్తూ రెసిడెన్షియల్, మున్సిపాలిటీ బర్త్ సర్టిఫికెట్లను తయారు చేస్తూ ఏజెంట్ల ద్వారా ఆధార్ కార్డులో మార్పులు చేస్తూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసేవాడన్నారు. కాగా, ఈ ఘటనలో అమరేందర్‌కు సహకరించిన నర్సంపేటకు చెందిన జులూరి ప్రభాకర్, వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతానికి చెందిన కొన్ని సురేశ్, మూడు వేముల రాజేందర్, హనుమకొండ పద్మాక్షి కాలనీ చెందిన గొల్లపల్లి శశికాంత్, భూపాలపల్లికి చెందిన సంకరమైన సాగర్, హనుమకొండ నక్కలగుట్టకు చెందిన నీరటి రాజేశ్, నాగపురి లిఖిత్‌కుమార్, ఎం.డి జుబేర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు.

జల్సాల కోసం అడ్డదారులు..

● గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్
● రూ. 2.69 లక్షల విలువైన సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న గార్ల-బయ్యారం సీఐ రవికుమార్

బయ్యారం: జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు యువకులు అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అడ్డదారులు తొక్కారు. గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కారు. ఈ మేరకు గురువారం బయ్యారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గార్ల-బయ్యారం సీఐ రవికుమార్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా రాజీవ్‌నగర్‌కు చెందిన పర్లపల్లి రాజు, వేల్పుల శాంతికుమార్, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరికి మేస్త్రీ పని ద్వారా వచ్చే డబ్బు సరిపోకపోవడంతో అక్రమంగా సంపాదించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా గంజాయి విక్రయాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పర్లపల్లి రాజు, వేల్పుల శాంతికుమార్.. గంజాయి కొనుగోలు చేయడానికి రెండు రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లారు. హుజూరాబాద్‌కు చెందిన రాజు తనకు పని ఉందని ఇంటి వద్దే ఉన్నాడు. విశాఖపట్నంలోని గోరాపూర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి వద్ద రూ. 2,69,250 లక్షల విలువైన 5.385 కేజీల గంజాయి కొనుగోలు చేసి రైలులో మంచిర్యాల వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు తనిఖీలు చేస్తారని భయపడి గార్ల రైల్వే స్టేషన్‌లో రైలు దిగి ఆటోలో మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నారు. అదే సమయంలో గంధంపల్లి వద్ద ఎస్సై తిరుపతి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బ్యాగుతో పరారయ్యేందుకు ప్రయత్నించారు. వీరిపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని బ్యాగు తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. దీంతో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి సరుకు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, అదనపు ఎస్సై మహబూబీ పాల్గొన్నారు.

సూర్యాతండాలో విషాదఛాయలు

● నర్సాపూర్‌లో తండా విద్యార్థి ఆత్మహత్య



తరుణ్ (ఫైల్)

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుల్లూరు జీపీ పరిధి సూర్యా తండాలో విషాదం అలుముకుంది. తండాకు చెందిన అజ్మీరా మేగ్యా, మంజుల దంపతుల పెద్ద కుమారుడు తరుణ్(19) మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కళాశాల సమీపంలోని ప్రైవేట్ హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగం చేసి తమను సాకుతావానుకుంటే ఇలా అర్ధాంతరంగా వెళ్లిపోయావా బిడ్డా అంటూ తల్లిదండ్రులు మేగ్యా, మంజుల.. కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. తరుణ్ మృతదేహానికి గురువారం సూర్యాతండాలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, తరుణ్ మృతికి గల కారణాలు నర్సాపూర్ పోలీసుల విచారణలో తేలనున్నాయి.

గిరిజన చేతి వృత్తులకు ప్రోత్సాహం

● ట్రైఫెడ్ జనరల్ మేనేజర్ సుబోజిత్ తరఫ్‌దార్



గిరిజన చేతివృత్తుల ఉత్పత్తులను పరిశీలిస్తున్న సుబోజిత్ తరఫ్‌దార్

హన్మకొండ: గిరిజన చేతి వృత్తులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ట్రైఫెడ్) రీజినల్ కార్యాలయం (రెండు తెలుగు రాష్ట్రాలు) జనరల్ మేనేజర్ సుబోజిత్ తరఫ్‌దార్ అన్నారు. గురువారం హనుమకొండ అశోకా కాలనీలోని గిరిజన భవన్‌లో గిరిజన చేతి వృత్తి కళాకారుల ఎంప్యానల్‌మెంట్ మేళా నిర్వహించారు. గిరిజన చేతి వృత్తి కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుబోజిత్ తరఫ్‌దార్ మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, గిరిజన సంఘాలను బలోపేతం చేయడం, గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం, గిరిజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ట్రైఫెడ్ కృషి చేస్తుందన్నారు. గిరిజన చేతి వృత్తుల కళాకారుల ఉత్పత్తులు పరిశీలించి వారిని ఎంప్యానల్ చేసుకోవడానికి ఈ మేళా ఏర్పాటు చేశామన్నారు. ట్రైఫెడ్‌కు దేశ వ్యాప్తంగా 150, హైదరాబాద్‌లో మూడు షోరూంలు ఉన్నాయన్నారు. గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులను ట్రైఫెడ్ కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తుందన్నారు. ఎంప్యానల్ జాబితాలో చోటు చేసుకున్న వారికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వారు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తామన్నారు. తద్వారా వారి జీవనోపాధి పెరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి వందన్ వికాస్ కేంద్రాస్ ద్వారా గిరిజన స్వయం సంఘాలకు రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించి వృత్తి శిక్షణ ఇచ్చి వారి ద్వారా వస్తు ఉత్పత్తి చేసి జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల గిరిజన సంక్షేమాధికారులు ప్రేమకళ, సౌజన్య, ట్రైఫాడ్ మార్కెటింగ్ హెడ్ జిషాన్, మార్కెటింగ్ అసిస్టెంట్ సందీప్ శర్మ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం వరదపాశం

● రాఘవాపూర్‌లో ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ



వరద పాశం పూజలు చేస్తున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని రాఘవాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు గురువారం రాఘవాపూర్ శివారులోని పోతరాజు గండి వద్ద వరద పాశం పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది గండిపోతరాజు బండి వద్ద వర్షాల కోసం పూజలు చేస్తామన్నారు. స్వామివారికి నైవేద్యం సమర్పించిన అనంతరం వరద పాశం ఉంచి పూజలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఏళ్ల ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇలా చేయడం వల్ల వర్షాలు కురుస్తాయని నమ్మకమన్నారు. రైతులు హన్మంత్, కుమార్, రాజేందర్, శ్రీహరి, రాజు, వెంకటయ్య, నర్సింహులు, రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు రైతులు సామూహికంగా వన భోజనాలకు వెళ్లారు.